నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | మార్చి 14, 2025 | www.navatelangana.com

జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా రత్నం ప్రదీప్

నవతెలంగాణ - కాసిపేట



యువజన కాంగ్రెస్ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. రత్నం ప్రదీప్ ప్రస్తుతం యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా తనను నియమించడం పట్ల రాష్ట్ర నాయకులకు ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఇన్వెంటరీ సర్వే

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) అటవీ ప్రాంతంలో గురువారం ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా బెంగళూరు అసిస్టెంట్ డైరెక్టర్ సమత్ సర్వే నిర్వహించారు. మొక్కల పెరుగుదల, అటవీ అభివృద్ధి, గడ్డి జాతుల పెరుగుదల, వివిధ అటవీ సంబంధ అభివృద్ధి అంశాలపై ఇన్వెంటరీ సర్వేను నిర్వహించారు. నిర్దిష్ట ప్రాంతం భౌతిక అంశాలు ఆస్తుల స్థితి జాబితా అంచనా ప్రాజెక్టు కోసం అటవీ సిబ్బందితో కలిసి సర్వే చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ నజీర్‌ఖాన్, ఎఫ్‌బి స్వప్న పాల్గొన్నారు.



రూ.39.875వేల విలువ గల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-జైపూర్

రూ.39.875 విలువ గల కిలో 595 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం డీసీపీ భాస్కర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఎస్సై శ్వేతకు అందిన సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భీమారం గ్రామ శివారు జాతీయ రహదారిలో ప్రభుత్వ అటవీ కలప డిపో ఎదురుగా నిందితులను పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. దుర్గం సందీప్, దుర్గం సంజయ్ ఇద్దరు మహారాష్ట్రలో గల చంద్రాపూర్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనితెచ్చి భీమారం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల వారికి తక్కువకు అమ్ముతున్నారు. వచ్చిన డబ్బులను జల్సాలకు వినియోగిస్తున్నారు. ఈ నెల 11న ఇద్దరు నిందితులు చంద్రాపూర్ నుండి కిలోన్నర గంజాయి కొనితెచ్చి గురువారం భీమారం గ్రామ శివారులో వనపర్తి కరుణసాగర్, రావుల ఆదర్శ్‌కు అమ్ముతుండగా ఎస్సై శ్వేత సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల సమాచారం మేరకు రామటెంకి స్వస్తిక్ కుమార్, జునేరి శ్రీనివాసును అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి కిలో 595 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో భీమారం ఎస్సై శ్వేతతో పాటు హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, ముత్తయ్య, శ్రీరాంపూర్ కానిస్టేబుల్ కార్తీక్, భీమారం హోంగార్డు సదాశివ్, ఏఆర్‌పీసీ అశోక్ ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

టవర్ నిర్మాణం ఆపాలని కాలనీవాసుల కన్నెర్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని జూబ్లీహిల్స్ కాలనీలో టవర్ నిర్మాణం ఏర్పాటు చేయొద్దని ఆ కాలనీవాసులు ఆందోళన బాట పట్టారు. అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేదని టెంట్ వేసుకొని నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. బుధవారం ప్రారంభించిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. టవర్ నిర్మాణం ఆపాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాలనీ యూనియన్ అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ జీఓ నెం.5 ప్రకారం స్కూళ్లకు, దేవాలయలకు, నివాస ప్రాంతాల సమీపంలో సెల్ టవర్ నిర్మాణం చేయకూడదన్నారు. నిబంధలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇండస్ సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. టవర్ యాజమాన్యంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టవర్‌తో పిల్లలకు, గర్భిణులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. గత సంవత్సరంలో టవర్ ఏర్పాటు చేస్తామంటే నిరసనకు దిగి నిర్మాణాన్ని ఆపమన్నారు. ఇప్పుడు మళ్లీ టవర్ నిర్మాణానికి యాజమాన్యం ముందుకొస్తోందని మండిపడ్డారు. ఒక వేళ టవర్ నిర్మాణం ఆపకపోతే నిరవధిక పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తిరుమలేశ్వర్, వనజ, సుధ, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉన్న విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలరు

- టీజీఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ శ్రావణి



నవతెలంగాణ-జైపూర్

విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి ఉంటే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించగలరని టీజీఎఫ్‌డీసీ (తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ) మంచిర్యాల డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. గురువారం కుందారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను విషయ పరిజ్ఞానంలో ప్రోత్సహించి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని కోరారు. పాఠశాల క్రాఫ్ట్ ఆర్ట్స్ టీచర్ శ్రీనివాస్ శిక్షణలో చిత్రలేఖనంలో మెలకువలు నేర్చుకున్న విద్యార్థులు వేసిన వివిధ రకాల పెయింటింగ్‌లు, కళాకృతులను పరిశీలించారు. గతంలో టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ద్వారా పాఠశాలకు అవసరమైన మౌళిక సౌకర్యాలు కల్పించామని ఆమె గుర్తు చేశారు. అనంతరం టీజీఎఫ్‌డీసీ అధికారులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహానికి స్థలం కేటాయించాలి

జైపూర్: మండల కేంద్రంలో శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టకు అవసరమైన స్థలం కేటాయించాలని ఛత్రపతి శివాజీ సేన నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాజీ సేన అభ్యర్థనకు జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించి అవసరమైన స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన వ్యవస్థాపకులు మంతెన ఉదయ్‌కిరణ్, ఉపాధ్యక్షులు ఎర్రం మనోహర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి రాంటెంకి సాయికుమార్, నర్వ సర్పంచ్ దూట రాజకుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాగమగిరి రాము, సభ్యులు గణముక్కుల నరేష్, నాగిరెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

గిరి పల్లెల్లో..తాగునీటి తాపం..!

- అడుగంటిన బోర్లు..పనిచేయని చేతిపంపులు
- అలంకారప్రాయంగా మారిన భగీరథ ట్యాంకులు
- ఊరికి దూరంగా ఉన్న బావి నీరే దిక్కు
- రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే పరిస్థితి
- ప్రత్యామ్నాయం కల్పించాలని ఆదివాసీ గిరిజనుల విజ్ఞప్తి

గిరి పల్లెలు తాగునీటి తాపంతో అల్లాడుతున్నాయి. ఎండలు తీవ్రమైన కొద్దీ తాగునీటి వనరులు మాయమైపోతున్నాయి. భూగర్భజలాలు లోలోతులకు పడిపోవడంతో బోర్లు, చేతిపంపులు పనిచేయడం లేదు. ఊరికి దూరంగా ఉండే బావుల్లో ఉన్న నీరే తమను రక్షిస్తోందని ఆదివాసీ గిరిజనులు చెబుతున్నారు. ఎండలు తీవ్రంగా మండుతున్న దృష్ట్యా రానున్న రోజుల్లో మరింత దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితేనే తాము తాగునీటి గండం నుంచి గట్టెక్కుతామని చెబుతున్నారు. గురువారం తాంసి మండలం లిమ్‌గూడ, గిరిగాం, అంబుగామ, అట్నాంగూడ తదితర గ్రామాలను నవతెలంగాణ సందర్శించింది. ఆయా పల్లెలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అక్కడి జనాలు ఏకరువు పెట్టడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



తాంసి మండలం లిమ్‌గూడలో రెండు బోరుబావులు ఉండగా ఇందులో ఒకటి పూర్తిగా ఎండిపోయింది. మరో బోరు నుంచి కొద్దిపాటి నీరు మాత్రమే వస్తోంది. మిగితా నీటి అవసరాల కోసం గ్రామానికి సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న బావి నుంచి తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నామని.. రానున్న రోజుల్లో మరింత సమస్య ఎదుర్కొంటామని గ్రామస్తులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బావి నుంచి ఊరి వరకు పైప్‌లైన్ మంజూరు చేస్తే నీటి సరఫరాలో ఇబ్బందులు దూరమవుతాయని అంటున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తాంసి

ఆదిలాబాద్ జిల్లాలో వేసవికాలం వచ్చిందంటే తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. మిషన్ భగీరథ వంటి పథకాలు వచ్చినా శాశ్వత పరిష్కారం చూపలేకపోయాయి. పైప్‌లైన్ల లీకేజీలు, సంపుల వద్ద తలెత్తున్న సాంకేతిక సమస్యలు, ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో పైప్‌ల నుంచి తగినంత ప్రెషర్‌లో నీటి సరఫరా కాకపోవడం వంటి సమస్య కారణంగా మిషన్ భగీరథ పథకం ఎక్కడికక్కడ ఆపసోపాలు ఎదుర్కొంటోంది. అనేక మంది పల్లెలు ఈ పథకం మీద ఆశలు వదులుకున్నాయి. స్థానికంగా ఉండే నీటి వనరులైన బోర్లు, చేతిపంపులు తదితర వాటిని నమ్ముకొని తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. తాజాగా వేసవి తీవ్రత దృష్ట్యా ఈ వనరులన్ని వట్టిపోవడంతో ఆయా పల్లెలు తాగునీటి కోసం గోస పడుతున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, ఉట్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నార్నూర్, గాదిగూడ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండగా.. మైదాన ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలు సైతం నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.

గిరి పల్లెల తాగునీటి గోస..!

వేసవి రాగానే ఆదివాసీ గిరిజన గూడేలు, తాండలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. తాజాగా తాంసి మండలం లిమ్‌గూడ, అంబుగామ, గిరిగాం, అట్నాంగూడ తదితర గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. లిమ్‌గూడలో 400జనాభా ఉండగా వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ మిషన్ భగీరథ ట్యాంకుకు నీరు ఎక్కకపోవడంతో వృధాగా ఉంటోంది. చేతిపంపులు లేకపోగా..బోరుకు మోటారు బిగించుకొని వాటి నుంచి వచ్చే నీటిని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఆ బోరు బావి నుంచి నీళ్లు రావడం లేదు. కేవలం ఐదు నుంచి పది నిమిషాల వరకు వచ్చే కొద్దిపాటి నీటితో అవసరాలు తీర్చుకోగా.. ఊరికి కిలోమీటరు దూరంగా ఉన్న బావి నుంచి ఎడ్లబండ్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కడ్నుంచి పైప్‌లైన్ వేస్తేనే తమ గ్రామానికి తాగునీటిని అందించవచ్చని అంటున్నారు. ఇక గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబుగామ పరిస్థితి కూడా ఇదే మాదిరి కనిపిస్తోంది. ఇక్కడ భగీరథ నీరు నాలుగు రోజులకు ఒకసారి వస్తోంది. తాగునీరు సరఫరా కాని రోజు ఎడ్లబండ్ల ద్వారా సమీపంలోని బోరుబావుల నుంచి తెచ్చుకుంటున్నట్లు ఆ గ్రామస్తులు చెబుతున్నారు. మిగితా చుట్టుపక్కల పల్లెల పరిస్థితి కూడా ఇదే మాదిరి కనిపిస్తోంది.



నీటి ఇబ్బందులు వివరిస్తున్న గ్రామస్తులు



అలంకారప్రాయంగా నీటి ట్యాంకు

చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : తొడసం సంబూజీ, తాజా మాజీ సర్పంచ్, లిమ్‌గూడ



తాగునీటి సరఫరాలో లోపాల కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మిషన్ భగీరథ రావడం లేదు. గ్రామంలో ఒక బోరుబావి నుంచి వచ్చే కొద్దిపాటి నీటినే వినియోగిస్తున్నాం. మిగితా అవసరాల కోసం దూరంగా ఉన్న బావి నుంచి తెచ్చుకుంటున్నాం. అధికారులు పైప్‌లైన్ మంజూరు చేస్తే బావి నుంచి ఊరి వరకు నీటిని తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుంది.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో పేదలతో గృహప్రవేశం

నవతెలంగాణ-మందమర్రి

డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వం పంచకుంటే, పార్టీ ఆధ్వర్యంలో ఇండ్లులేని పేదలతో గృహప్రవేశం చేయిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్టీ మందమర్రి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాలచెట్టులోని డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిందన్నారు. అందులో భాగంగా మందమర్రి పాలచెట్టు ప్రాంతంలో కోట్లాది రూపాయలతో దాదాపు 500 ఇండ్లను నిర్మించిందని, సర్వేల పేరుతో సంవత్సరాలు గడిచిపోయాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నప్పుడు ఇండ్లు ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదలకు పంచడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించి ఎవ్వరికీ ఇవ్వకపోవడంతో పిచ్చి మొక్కలతో గోడలు బీటలు వారి పందులు, కుక్కలకు అవాసాలుగా మారాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇండ్లను పంచాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో ఇండ్లు లేని నిరుపేదలందరితో గృహప్రవేశం చేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, ఎర్మ పున్నం, బోడెంకి చందు, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, దుంపల రంజిత్ కుమార్, సామల ఉమారాణి, దాగం శ్రీకాంత్, భాగ్య, నిర్మల పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) బృందం

ఇష్టమొచ్చినట్టు మాత్రలు వాడితే కిడ్నీలపై ప్రభావం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యుల సూచనలు లేకుండా పెయిన్ కిల్లర్ మాత్రలు వేసుకోవద్దని, ఇష్టమొచ్చినట్టు మాత్రలు వాడితే కిడ్నీలపై ప్రభావం చూపుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ డయాలసిస్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దీనికి డైరెక్టర్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డయాలసిస్ కేంద్రంలో ఉన్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా నొప్పి మందులను వాడొద్దని సూచించారు. ఇష్టారీతిన మందులను వాడటం వల్ల కిడ్నీలపై ప్రభావం చూపి సమస్యలు వస్తాయన్నారు. ఇప్పటికే రిమ్స్‌లో 97 మంది నిత్యం డయాలసిస్ చేసుకుంటున్నారన్నారు. ఆరోగ్యం మన చేతుల్లో ఉందని, దాన్ని కాపాడుకోవాలని తెలిపారు. నిత్యం యోగాతో పాటు ఆహార అలవాట్లను మార్చుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్ల కారణంగా గ్రామాల్లో పట్టణాల్లో తేడా లేకుండా ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడి మూత్రపిండాల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లను మార్చుకున్నప్పుడే మూత్రపిండాల వ్యాధులు తగ్గుతాయని తెలిపారు. కిడ్నీ సమస్యలు రావడానికి 80 శాతం కారణమయ్యే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మధుమేహం ఉన్నవారు అధికంగా డయాబెటిక్ నెఫ్రోపతికి గురవుతుంటారని తెలిపారు. మద్యం, అధిక ప్రోటీన్లు తీసుకోవడంతో యూరిక్ యాసిడ్ పెరిగి కిడ్నీల సమస్యలు అధికమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ఆర్ఎంఓ చందు, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి రాథోడ్ ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

- రిమ్స్‌లో కిడ్నీ డే వేడుకలు



నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లంక రాఘవులు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ఆకుర్ల గ్రామంలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు అన్నారు. గురువారం ఆకుర్ల గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యపై గ్రామస్తులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 280 కుటుంబాలున్నాయని, గ్రామంలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. పెన్‌గంగ నుండి ఆకుర్ల వరకు పైపులైన్ ద్వారా నీటిని అందజేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలతో నీటి సమస్యపై మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులపై మహిళలు భావోద్వేగంతో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి కార్యక్రమం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరాల రోడ్ వద్ద రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆత్రం కిష్టన్న, నాయకులు బొజ్జ గంగారాం పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-చింతలమానేపల్లి

లంబాడిహేటి గ్రామానికి చెందిన అజ్మీర శాంతాబాయి(53) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేష్ వివరాల ప్రకారం..శాంతాబాయి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అప్పులు అయ్యాయి. దీంతో ఆత్మహత్యకు పాల్పడింది. కొడుకు అజ్మీరా ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పట్టణానికి చెందిన బొప్పు సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సతీష్ ఈ నెల 11న మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించి ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత కోరారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీతో పాటు సీడీపీఓకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17, 18న కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నా, వంటావార్పు, రాత్రి బస ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు విజయ, ఉమా, నర్సమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

సైన్స్ కళాశాలలో 'పై డే' వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యంలో 'పై 'డేను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత పాల్గొని మాట్లాడుతూ పై విలువ గురించి విద్యార్థులకు వివరించారు. నిత్య జీవితంలో ప్రతి సందర్భంలో గణితం అవసరం పడుతుందని పేర్కొన్నారు. పై విలువ 3.14 కాబట్టి మార్చి 14న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని పేర్కొన్నారు. ఇందులో గణిత విభాగ అధిపతి డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ జగ్రామ్ అంతర్వేది, రమాకాంత్ గౌడ్, సంతోష్ కుమార్,మంజుల, రవి కిరణ్, జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-పెంబి

అగ్రి ఇన్‌పుట్ వ్యాపారులు తప్పనిసరిగా ఎరువులు పురుగు మందులు విత్తనాలకు సంబంధించి ప్రభుత్వ నియమ నిబంధనలను తూచా తప్పకుండా అమలు పరచాలని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ సూచించారు. గురువారం వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్‌తో కలిసి మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారీ విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం వ్యాపారులు గోదాంలలో నిల్వ ఉంచిన ఎరువులు, పురుగు మందుల ఎక్స్‌పైరీ డేట్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. యూరియా విక్రయాలు తప్పనిసరిగా పీఓఎస్ యంత్రాల ద్వారే చేపట్టాలన్నారు. ఇందులో స్థానిక మ్యాక్స్ చైర్మన్ సల్లా రామేశ్వర్ రెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడానికి టీఎన్జీఓస్ పోరాటం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి టీఎన్జీఓస్ పక్షాన పోరాడుతున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని డీసీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాలూకా సంఘం టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, తాలూకా అధ్యక్షుడు ఎ.మహేందర్, ప్రధాన కార్యదర్శి కొమ్రేవార్ అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎంఎ కలీం, శ్రీనివాస్, వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ నవీన్, టీ.నవీన్, కృష్ణ, అన్నపూర్ణ, కోశాధికారి సునీల్, ప్రచార కార్యదర్శి సోహెల్, ఆర్గనైజ్ సెక్రెటరీ అఖిల్, ఈసీ మెంబర్ నితిన్, సంతోష్ తేజ ఉన్నారు.

ప్లే స్కూల్లో వాటర్ బ్రేక్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలో రానున్న రోజులలో ఎండలు 40 నుంచి 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో పలువురు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని కిడ్జ్ ప్లే స్కూల్లో వాటర్ బ్రేక్‌ను గురువారం ప్రారంభించారు. ప్రతి గంటకు పిల్లలు నీటిని తాగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంట్లో కూడా పిల్లలు ఎక్కువ మొత్తంలో నీటిని తాగేలా తల్లిదండ్రులు చూడాలని స్కూల్ నిర్వాహకులు వేణుగోపాల్ యాదవ్ కోరారు.

భీం దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



మార్చి 15 మాన్యవర్ కాన్షిరాం జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14 బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వరకు జరిగే భీం దీక్షను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ అన్నారు. భీం దీక్ష అంటే జ్ఞాన దీక్ష అని దీనిని జిల్లాలోని అన్ని గ్రామాలలోని అంబేద్కర్ సంఘం సభ్యులు నాయకులు తప్పకుండా భీం దీక్షని స్వీకరించాలని కోరారు. దీక్ష ప్రారంభ కార్యక్రమం నిర్మల్ సోఫీ నగర్‌లో గల బుద్ధ విహార్ కేంద్రంలో ఈనెల 15న జరుగుతుందని ఇట్టి కార్యక్రమాన్ని అంబేద్కర్ సంఘ నాయకులు సభ్యులు బహుజనవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా ట్రెజరీ సేపురి సిద్ధు, జిల్లా నాయకులు ఆకుల రమేష్, పులి అశోక్, పుష్పుర్ సతీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో హోలి జరుపుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సహజ రంగులను ఉపయోగించి ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా హోళీ పండుగ జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈతరాని వారు నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా ఉండటమే శ్రేయస్కరమని పేర్కొన్నారు. వాహనాలపై వెళ్లే వారిపై, ఇతరుల అనుమతి లేకుండా రంగులను పూయరాదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి రోడ్లపై హంగామా చేసినా, వాహనాలు నడిపినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

లింగానిర్ధారణ చేస్తే చర్యలు : డీఎంహెచ్ఓ



డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డయాగ్నోస్టిక్ కేంద్రాలలో లింగానిర్ధారణ చేస్తే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. డయాగ్నోస్టిక్ కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. స్కానింగ్ వివరాలు, ఇతర వాటిని పరిశీలించి కేంద్రాల నిర్వహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు వచ్చే గర్భిణీలకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. ఎక్కడైన నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏ కేంద్రంలో అయిన లింగానిర్ధారణ చేసినట్టు తెలిస్తే చట్ట పరంగా యాక్షన్ తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా స్కానింగ్‌తో పాటు ఇతర పరీక్షలకు సబంధించి ధర పట్టినను రోగులకు కనిపించేల ప్రదర్శించాలని సూచించారు. పోలీసు, తహసీల్దార్, స్వచ్ఛంద సంస్థ, ఆరోగ్య సిబ్బందితో కలిపి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, నిత్యం డయాగ్నోస్టిక్ కేంద్రాలను తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎక్స్ రే మిషన్ అందించడం అభినందనీయం

వంద రోజుల టీబీ స్కినింగ్ కార్యక్రమంలో క్షయ అనుమానితులకు ఎక్స్ రే తీయడానికి ఇబ్బందులు వచ్చాయని ఇదే విషయాన్ని స్వచ్ఛంద సంస్థకు తెలియజేయడంతో వారు హ్యాండిల్ ఎక్స్ రే మిషన్‌ను అందించడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం క్షయ నియంత్రణ కేంద్రంలో సుశోధన స్వచ్ఛంద సంస్థ రూ.20 లక్షల విలువల గల హ్యాండిల్ ఎక్స్ రే మిషన్ డీఎంహెచ్ఓకు అందించారు. దాని పని తీరు గురించి ఆయన వివరించి మాట్లాడుతూ జిల్లాలో వంద రోజుల క్షయ గుర్తింపు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి అనుమానితుల శాంపిల్స్‌తో పాటు ఎక్స్ రే తీయడానికి సిబ్బంది ఆస్పత్రికి రేఫర్ చేస్తున్నారని తెలిపారు. అయితే జిల్లాలో రెండే ఎక్స్ రే మిషన్లు ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఇదే విషయాన్ని సుశోధన స్వచ్ఛంద సంస్థ ఎండీకి తెలియజేయడంతో ఆయన హ్యాండిల్ ఎక్స్ రే మిషన్‌ను నెల రోజుల కోసం క్షయా నియంత్రణ కేంద్రానికి ఇచ్చారన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు వెళ్లిన సమయంలో అనుమానితులకు అప్పటికప్పుడే ఎక్స్ రే తీసి నిర్ధారించే అవకాశం ఉంటుందన్నారు. ఇలానే స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీబీ అధికారిణి సుమలత, సమియోద్దిన్, ఎన్జీఓ ప్రతినిధులు, క్షయ నియంత్రణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి ఎల్లలు దాటించిన ఘనత కవితకే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ఎల్లలు దాటించిన ఘనత ఎమ్మెల్సీ కవితకు దక్కుతుందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్‌లో సత్యసాయి అన్నదాన సత్రంలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రోగి సహయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రంగినేని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి అయిన బతుకమ్మకు నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ వస్తుందన్నారు. జాగృతిని ఏర్పాటు చేసి సంస్కృతిని చాటి చెప్పిన ఘనత కవితకు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్‌పై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తే కాంగ్రెస్ దానిపై ఆలోచించిందన్నారు. ఇలానే ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్, జాగృతి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో జాగృతి, బీఆర్ఎస్ మహిళ నాయకురాళ్లు శివకుమార్, ప్రమోద్, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, మమత ఉన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : కేక్‌కట్ చేస్తున్న జాగృతి నాయకులు



ఉట్నూర్ : విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

ఉట్నూర్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలోని వికలాంగుల వికాసం పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం, సాధనలో తనదైన శైలిలో కల్వకుంట్ల కవిత కృషి చేశారని పేర్కొన్నారు. ఇందులో నాయకులు మహేందర్, క్రాంతికుమార్, బాబా శ్యామ్ టైగర్, భూమన్న సత్తన్న, సూర్య కుమార్, యాదవ్ ఉమేష్ పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు : కాంగ్రెస్



జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కడెం

జగదీశ్వర్ రెడ్డి అసెంబ్లీలో చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం నిరసనగా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ పేదల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. జగదీశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని అతనిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పడిగెల భూషణ్, డైరెక్టర్లకు మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మండలల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తారి శంకర్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ గుప్తా, ముడికే మల్లేష్ యాదవ్, బరుపటి రమేష్ వర్మ, డైరెక్టర్‌లు ఊరే జలజ, దండుగుల యాదగిరి, లక్కవత్తుల నారాయణ, అంబారిపేట్ మాజీ ఎంపీటీసీ కట్ల సింధూజ, సాగర్, సీనియర్ నాయకులు దేవేందర్ గౌడ్, బ్రహ్మచారి, ఇస్రు పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎస్పీని కలిసిన నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన ఎస్పీగా నియామకమైన అఖిల్ మహాజన్‌ను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కలిశారు. గురువారు జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు తడిసెన వెంకట్ రెడ్డి, అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమెల నవీన్ రెడ్డి, కుదురుపాక సురేష్, కొరటి ప్రభాకర్, అలీమ్ ఖాన్, సమ్ము ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఆదిత్య ఖండేష్కర్

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్‌ను గురువారం ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఆదిత్య ఖడేష్కర్, జన్నువార్ గజనంద్, కుమ్మరిపెల్లి సాయి తేజ, గుండావార్ సాయి కృష్ణ, సందీప్ శర్మ, రాకేష్ రెడ్డి, మనోజ్ ఉన్నారు.



ఆదిలాబాద్ టౌన్ : ఎస్పీని సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

జైనథ్ : బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాకేష్ రెడ్డి గురువారం మండల నాయకులతో కలిసి ఎస్పీ అఖిల్ మహాజాన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మండలంలో శాంతి భద్రతలను ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఉండాలని కోరారు. అతని వెంట సూర్య, ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన అలిశెట్టి నాగన్న గురువారం నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రతన్ ఉన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ ఎదుట ఏమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన దీక్ష రెండవ రోజుకు చేరుకుంది. గురువారం మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం చేయకుండానే అన్ని ఉద్యోగాల ఫలితాలను వెల్లడిస్తున్నారన్నారు. ఒకవైపు ప్రజాపాలన అంటూ మరోవైపు మాదిగలకు శాపంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఉద్యోగాలన్నీ మాలలకు, ఉత్త వర్గీకరణ మాదిగలకు చేయడమంటే ముమ్మాటికి నమ్మకద్రోహమే అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుకూలంగా నిండు శాసనసభలో మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరగా ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి ఉద్యోగాలలో జనాభా దమాషా ప్రకారం మాదిగల వాటను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నిరసన దీక్షలతో పాటు కాంగ్రెస్ అంతం మాదిగల పంతం అనే నినాదంతో ముందుకు పోతామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆరెపల్లి గణేష్, టౌన్ నాయకులు పెద్దింటి సూర్యప్రకాష్, కుంటాల చరణ్ దాస్, రోడ్డ గంగన్న, మురళి, మహిళలు పాల్గొన్నారు.

కేఎన్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం



నవతెలంగాణ-సారంగాపూర్

కేఎన్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, దశరథ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య అన్నారు. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కోర్వ నవీన్ రెడ్డి న్యాయవాది నెలకొల్పిన కొర్వ నవీన్ రామ క్రిష్ణ రెడ్డి ట్రస్ట్(కేఎన్ఆర్) ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంతో పాటు కౌట్ల(బి), మలక్ చించోలి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, ఇంగ్లీష్ డిక్షనరీలు, పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు ప్రగతి బాట పడతాయన్నారు. కార్యక్రమంలో ఒల్లత్రి నారాయణ రెడ్డి, జగదీష్, లక్ష్మణ్, సత్యం, భోజన్న, రమేష్, పోతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా కొనసాగుతున్న ఉపాధి హామీ సర్వే

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని 23 గ్రామ పంచాయతీలో ఏప్రిల్ 2023 నుండి మార్చి 2024 వరకు కొనసాగిన ఉపాధి హామీ పనులపై సర్వే కొనసాగుతోంది. గురువారం మండలంలోని తాడిహత్నూర్‌లో డీఆర్పీలు బి.రజిత, ఎల్.అజయ్, వీఆర్‌పీలు బి.రేఖ, వి.మనోహర్, సాయికృష్ణ ఇంటింటా తిరుగుతూ ఉపాధి హామీ పనులపై సర్వే చేశారు. అటూ వ్యవసాయ క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించారు. మండలంలో 15 మంది బృందం సభ్యులతో సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు : కలెక్టర్

నవతెలంగాణ,-ఆదిలాబాద్‌టౌన్

హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజర్షి షా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పాల్గుణ మాసం పౌర్ణమి రోజున దేశ వ్యాప్తంగా పండుగను జరుపుకుంటారన్నారు. జిల్లా ప్రజలు అందరూ ఆనందోత్సవాలతో, సంతోషంగా పండుగను సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. అలాగే పిల్లలు రంగుల చల్లుకొనే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కుమ్మరి సంఘ భవనంలో సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ 585 జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షులు రామెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ స్త్రీలకు అక్షరాస్యత లేని కాలంలో కూడా శూద్ర కులంలో పుట్టిన మొల్లమాంబ రామాయణాన్ని తెలుగులో రాయడం అందరికి సులువుగా అర్థమయ్యే విధంగా రాశారన్నారు. ఆమె ఆదర్శలను కుమ్మర్లందరూ తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కుమ్మర్ల ఐక్యత కోసం పాటుపడాలని తీర్మానించారు. కార్యక్రమంలో కన్నం మోహన్ బాబు, నూటెంకి సత్యనారాయణ, కిష్టన్న, రాజేందర్, మల్లయ్య, విట్టల్, మోహన్, అశోక్, సాయి, కన్నం శివకుమార్, రాజశేఖర్, దేవేందర్, శంకర్, గణేష్ పాల్గొన్నారు.

ప్రీతంరెడ్డికి కజ్జర్ల గ్రామస్తుల సన్మానం

నవతెలంగాణ-తలమడుగు



మండలంల్లోని కజ్జర్ల గ్రామానికి చెందిన చింతలపల్లి ప్రీతంరెడ్డి గ్రూప్-2లో ఫలితాల్లో రాష్ట్రంలో ఐదవ ర్యాంక్, జోనల్‌లో 1 ర్యాంక్ సాధించడంతో గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. అదే గ్రామానికి చెందిన తలారి పోతన్న కుమార్తె లింగమ్మ గురుకులం తెలుగు జూనియర్ లెక్చరర్, పోతన్న ఇద్దరు కుమారులు తలారి లింగన్న, తలారి శ్రీకాంత్ డీఎస్సీలో తెలుగు ఉపాధ్యాయులుగా, అగ్గిమల్ల గంగన్న కుమార్తె మణిలత స్కూల్ అసిస్టెంట్ సాంఘీక శాస్త్రం సెలెక్ట్ కావడంతో గ్రామస్తులు వీరిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టి కిరణ్ కుమార్, అగ్గిమల్ల గంగన్న, వెంకట్‌రెడ్డి, జైభారత్‌రెడ్డి, తలారి పోతన్న, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, ఉపాధ్యాయులు రఘునాథ్, మహేష్, రవీందర్, దాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వివిధ రకాల పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవనంలో ఏర్పాటుచేసిన ఫ్రిడ్జ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు శుద్ధమైన చల్లని తాగునీటిని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్‌ను ఆదేశించారు. తాగునీటికి ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌లో ఏమైనా సమస్యలుంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, తక్షణమే తాగునీటి ఏర్పాటు చేయాలని తెలిపారు.

పాఠశాలలో హోలీ వేడుకలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ ఈకో క్లబ్‌లో భాగంగా ప్రకృతిలో లభించే సహజరంగులతో హోలీ పండుగను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బీట్రూట్, బొగ్గు, రంగురంగుల పుష్పాలతో రంగులను సహజసిద్ధంగా తయారు చేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు పండుగ నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, భారతి, భాష, భాగ్యశ్రీ, ఆఫ్తాబ్, సంతోష్, ధనరాజ్, నాగరాణి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కిడ్నీ డే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అపెక్స్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రంలో ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిహెచ్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ ప్రసాద్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి రెండవ వారం మూత్రపిండాల దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. మూత్రపిండాల ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక దినోత్సవం నిర్వహిస్తారని అన్నారు. అనంతరం డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి తిరుపతి, ఇస్లాం బిన్ హసన్‌ను పూలమాలవేసి శాలువాతో సన్మానించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ కుమార్, ప్రసాద్, సుభాష్, స్రవంతి, మహేష్ టెక్నీషియన్స్ అంబుదాస్, విశ్వనాథ్, మంగులాల్, హేమలత, డీఈఓ సుచరిత, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



నవతెలంగాణ-జైనూర్

నాబార్డు సౌజన్యంతో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పుల్లారా గ్రామ పంచాయతీలో నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోకా రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి బ్యాంకులో పొదుపు ఖాతా కలిగి ఉండాలన్నారు. శ్రీనిధి డిపాజిట్ పథకంలో 400 రోజులకు అన్ని బ్యాంకులకంటే అధిక వడ్డీ 8.50 శాతం, సీనియర్ సిటిజన్‌కు తొమ్మిది శాతం వడ్డీ ఉంటుందన్నారు. బంగారు ఆభరణములపై గ్రాముకు రూ.5900 ఇవ్వడం జరుగుతుందని, నెలసరి వడ్డీ 82 పైసలు మాత్రమే కట్టాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఖాతారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పీఎం బీమా పథకాలపై, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత వై.రమేష్ రైతులకు" అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుడిమెత యశ్వంత్‌రావు, మాజీ ఎంపీటీసీ ఆత్రం మెంగారావు, మాజీ సర్పంచ్ పటేల్, ఆత్రం కర్చు, పీఏసీఎస్ డైరెక్టర్ కనక రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



నవతెలంగాణ-వాంకిడి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఖాతాదారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ జాడి కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని, బ్యాంకుకు వచ్చే ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీముఖ్, సీఎస్‌పీ ప్రతినిధులు దుర్గం రాకేష్, రామగిరి రాంబాబు పాల్గొన్నారు

హోలీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హోలీ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు, మద్యం మత్తులో వాహనాలు నడపడం చేయరాదన్నారు. ఉదయం 6 నుండి 12 వరకు వేడుకలు నిర్వహించుకోవాలని, సురక్షితమైన రంగులు మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనాలున్న రంగులను వాడొద్దన్నారు. పబ్లిక్ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధమని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు ఫోన్ చేయాలని, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

31 లోపు పన్నులు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్సులు, వాణిజ్య పన్నులను ఈనెల 31లోపు చెల్లించాలని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. బిల్ కలెక్టర్ వద్ద లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా లేదా మున్సిపల్ కార్యాలయంలో కాని పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. లేని పక్షంలో బకాయిలపై 2 శాతం వడ్డీ విధించడం జరుగుతుందని, మొండి బకాయిదారుల ఆస్తులను పురపాలక చట్టం 2019 సెక్షన్ 87 ప్రకారం జప్తు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

జిల్లాకు 47మంది జూనియర్ లెక్చరర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జేఎల్‌కు అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తున్న డీఐఈఓ

టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగం సంపాదించి బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తర్వులు తీసుకున్న 47 మంది జూనియర్ లెక్చరర్లను జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కేటాయించామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి తెలిపారు. ఇప్పటికే కొంతమంది విధుల్లో చేరారని గురువారం సాయంత్రం వరకు మిగతావారు చేరుతారని తెలిపారు. అయితే జిల్లాలో పది సంవత్సరాల నుండి ఇప్పటివరకు 61 మంది అతిథి అధ్యాపకులు పనిచేయగా ప్రస్తుతం నూతనంగా వచ్చిన జూనియర్ అధ్యాపకులు 47 మందితో అతిథి అధ్యాపకులు ఉపాధి కోల్పోవడం పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ మాధ్యమిక విద్య వ్యవస్థను జిల్లాలో పది సంవత్సరాల నుండి రక్షిస్తున్న తమ స్థానంలోకి రెగ్యులర్ అధ్యాపకులు రావడం బాధగా ఉందని ప్రభుత్వం తమకు ఏదైనా ప్రభుత్వ విద్య వ్యవస్థలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

కళాశాల వారిగా కేటాయించిన వివరాలు

బెజ్జూర్ కళాశాలలో ఆంగ్లం, ఆర్థిక శాస్త్రం, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం అధ్యాపకులను కేటాయించగా, దహెగాంలో ఆంగ్లం, హిందీ, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, జైనూర్‌లో ఆర్థిక శాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక శాస్త్రం, గణితం, రసాయనం, కెరమెరిలో గణితం, జంతు శాస్త్రం, వృక్షశాస్త్రం, భౌతికశాస్త్రం, కౌటాల కళాశాలలో ఆర్థిక, గణిత, వృక్ష, భౌతిక శాస్త్రాలకు, రెబ్బెన కళాశాలలో హిందీ, వృక్ష శాస్త్రం, రసాయన శాస్త్రం, సిర్పూర్(టి) ఆంగ్లం, పౌరశాస్త్రం, జంతుశాస్త్రం, కాగజ్‌నగర్ కళాశాలలో 2 ఇంగ్లీష్, ఉర్దూ, ఆర్థిక శాస్త్రం, గణితం, రసాయన శాస్త్రం, తిర్యాణి కళాశాలకు కామర్స్, వృక్షశాస్త్రం, వాంకిడి కళాశాలకు ఆర్థిక శాస్త్రం, గణితం, హిందీ, వృక్షశాస్త్రం, ఆసిఫాబాద్ కళాశాలకు ఉర్దూ మీడియం అర్థశాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రంతో పాటు హిందీ, అర్థశాస్త్ర అధ్యాపకులను కేటాయించారు.

హాస్టల్ వర్కర్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు



సమ్మెలో కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె రెండవ రోజు గురువారం సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ శిబిరం వద్దకు చేరుకొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ64 అమలు నిలిపివేయాలని, పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. 212 జీఓను సవరించి, 2014 నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కొత్త మెనూ వల్ల పెరిగిన పనిభారానికి అనుకుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. వయస్సు మళ్లిన వర్కర్ల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలన్నారు. ఆదివాసీ గిరిజనుల ప్రధానమైన హోలీ పండుగను పురస్కరించుకుని పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా కార్యదర్శి మెస్రం సీతారాం, జిల్లా నాయకులు సధాశివ్, ఇందు రమేష్, పతుబాయి, రాంబాయి మాన్కు వసంత్ రావ్, జంగూ, దివ్య, జంగుబాయి, కన్నుబాయి, మామిడి లక్ష్మీ క్రిష్ణ పాల్గొన్నారు.

అపార్ నమోదు పకడ్బందీగా చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

అపార్ గుర్తింపు కార్డులను నమోదు, సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం ఆర్డీఓ లోకేశ్వర్ రావు, డీటీడీఓ రమాదేవిలతో కలిసి అపార్, సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాల నిర్వహణపై జూమ్ మీటింగ్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థుల అపార్ గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు చేపట్టాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, తరగతి గదుల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని, పాఠశాలల, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బోధన తీరును పరిశీలించి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం క్రింద అమలవుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేయాలని, వారి పరిధిలోని పాఠశాలలను సందర్శించి నివేదికలు అందించాలని, ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల వివరాలను తెలియజేయాలన్నారు.

సమాజ రక్షణకు సైనికుల్లా పనిచేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వాంకిడి

సమాజ రక్షణ కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని భారతీయ బౌద్ధ మహాసభ(బీఎస్ఐ) జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమతా సైనిక్ దళ్ 98వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 మార్చి1927లో అంబేద్కర్ రక్షణ కోసం ఏర్పడిందని, ఇప్పుడు అది అణగారిన ప్రజల రక్షణ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకొని ఆపద సమయంలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉండే వారే సమతా సైనిక్ దళ్ సభ్యులన్నారు. సమాజంలోని స్థితిగతులను అధ్యయనం చేసి అందరిలో చైతన్యం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను, అత్యాచారాల నుండి విముక్తికి దళిత యువకులు తమకు తాము ఒక సైనాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. అప్పుడే దుండగుల దాడుల నుండి సమాజాన్ని రక్షించుకోగలుగుతారన్నారు. యువత ముందుకు వచ్చి అందరిలో విద్యపై చైతన్యం కల్గించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా సమతా సైనిక్ దళ్ దినోత్సవం

మండలకేంద్రంలో గురువారం 98వ సమతా సైనిక్ దళ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సర్వీస్ రోడ్డుపై మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండలాధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి దుర్గం అనిల్‌కుమార్, సమాజ అధ్యక్షుడు కోబ్రాగడే విలాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బౌద్ధ ఉపాసక్ పాండూజీ, హిరీశం పాల్గొన్నారు.

హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కొమురయ్య ఒక ప్రకటనలో కోరారు. మండల ప్రజలు హోలీ పండగను ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటలలోపే వేడుకలు ముగించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని అదేవిధంగా పండుగ వాతావరణాన్ని ముగించుకొని ఇంటికి పరిమితం కావాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు లేదా పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలన్నారు. యువకులు ప్రజలకు అసౌకర్యాలు కలిగించేలా చర్యలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పెద్దవాగు, ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల ప్రజలు, యువకులు నది తీరంలో స్నానాలకు వెళ్లకూడదని తెలిపారు.

చింతలమానేపల్లి : మండల ప్రజలు హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఇస్లావత్ నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం వరకు వేడుకలను ముగించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపద్దని, అదేవిధంగా పండుగ వాతావరణాన్ని ముగుసుకొని ఇంటికి పరిమితం కావాలన్నారు. మండలంలో దిందా, గూడెం, భూరెపల్లి, రన్‌వెల్లి, కోర్చిని ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల ప్రజలు, యువకులు నది తీరంలో స్నానాలకు వెళ్లొద్దన్నారు.

విద్యార్థుల్లో నూతనత్వాన్ని నింపడమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో ఎప్పటికప్పుడు కొత్త అంశాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు నూతనత్వాన్ని నింపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కాగజ్‌నగర్ మైనార్టీ గురుకుల బాయ్స్-2 పాఠశాల ప్రిన్సిపాల్ శగుస్త ఫిర్దోస్ అన్నారు. పీఎంశ్రీ పథకంలోని ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జ్యోతిబా పూలే పాఠశాలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిశీలన వల్ల కొత్త అంశాలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులలో నైపుణ్యాల మార్పిడికి తోడ్పడుతుందన్నారు. రెండు పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ, కంప్యూటర్ గది, డైనింగ్ హాల్ పరిశీలించి వీటి నిర్వహణ గురించి ఇతర అంశాల గురించి ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు చర్చించుకున్నారు. ల్యాబ్‌లోని పరికరాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్, జ్యోతి బాపూలే ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు రాంబాబు, రామకృష్ణ, నాగమణి, రాజరెడ్డి, నీహారిక, ఆసిఫ్, ఆత్మరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలుకపెల్లి గ్రామానికి చెందిన చిలువేరు భాస్కర్-శారద దంపతులు వారి కూతురు చిలువేరు సుకన్య జ్ఞాపకార్థం ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్టాపనను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు వారి కూతురు డాక్టర్ సుప్రియ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని 100శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన పొలంపెల్లి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సరస్వతి శిశుమందిర్‌లో చదువుకున్న వారు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. సమాజంలో ప్రవర్తించాల్సిన తీరు పాఠశాలలో నేర్పుతారని దీనికి శిశుమందిరాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఉన్నత విలువలు కలిగినప్పుడే ఆదర్శప్రాయంగా ఉంటారన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగిన ఒదిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, మాతృభారతి సభ్యులు కల్లూరి వైష్ణవి, దుర్గ, రమాదేవి, అఖిల, స్వాతి, స్వప్న, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ బాధితునికి రక్తదానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న ఆరు సంవత్సరాల చరణ్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా యువత రక్త అవసరాన్ని తెలియజేశారు. వెంటనే స్పందించిన అజ్మీర మధు ఆస్పత్రికి చేరుకొని రక్తదానం చేశారు. మధు ఔదార్యం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువకులు నవీన్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పరిధిలో శుక్రవారం జరిగే డయల్ యువర్ డిఎం టీజీఎస్ఆర్టీసి కార్యక్రమాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. నేడు ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడుతుందని, జిల్లా పరిధిలోని ప్రయాణికులు 9959226006 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలను తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు అందరూ సద్వినియోగం చేసుకోగలరు.

ప్రణాళికతో చదివి ఉత్తీర్ణులవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల విజయ ధర్మ సూచించారు. గురువారం మండలంలోని తపాలాపూర్ జడ్పీ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థులకు మలుపు లాంటివన్నారు. ఎలాంటి భయ ఆందోళనలకు గురి కాకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో తమ పరీక్షలు రాసి పాస్ కావాలని కోరారు. ఈ పరీక్షల్లో 90 శాతం అంటే 540 మార్కులు సాధించిన విద్యార్థికి తగిన పారితోషకం ఇస్తానని, ఎంతమంది విద్యార్థులు తెచ్చుకుంటే వారందరికీ ఇస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు సుంకం సుశీల, గ్రామ అధ్యక్షుడు రమేష్ గౌడ్, తపాలపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్, ఉపాధ్యాయులు, తూంగూరి గోష్పాల్, దుంపల తిరుపతి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-తాండూర్



కన్నెపెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంగంపల్లి గ్రామంలో పెద్దింటి వెంకటేష్ ఇంట్లో అక్రమంగా 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడనే సమాచారం మేరకు ఇంటిలో తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 3.5 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు తెలిపారు. నిందితున్ని విచారించగా సూర్జపూర్ గ్రామానికి చెందిన ఇందూరు లక్ష్మణ్ అనే వ్యక్తి తన ఇంట్లో బియ్యాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన ప్రేమికులు

నవతెలంగాణ-జైపూర్

ఇందారం శివారు పౌనూర్ ఎక్స్ రోడ్డు ఏరియాలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రేమికులపై దాడికి పాల్పడ్డారని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. రెబ్బన మండల కేంద్రానికి చెందిన అరికిల్ల సుమన్ గోదావరిఖని పట్టణానికి చెందిన ప్రేమికురాలితో కలిసి మోటార్ సైకిల్‌పై మంచిర్యాల వైపు వస్తుండగా దాడి జరిగిందన్నారు. వస్తున్న క్రమంలో మూత్ర విసర్జన కోసం పౌనూర్ ఎక్స్ రోడ్డు వద్ద బండి ఆపడంతో మద్యం తాగి ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు వీరిపై దాడికి పాల్పడ్డారు. దుండగులు వీరి వద్ద రూ.4000 నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారని పేర్కొన్నారు. దాడిలో గాయపడిన సుమన్, ఆయన ప్రేమికురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎండు తెగులు నివారణ చర్యలు చేపట్టండి

- వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్



నవతెలంగాణ-జైపూర్

వరి పైరును ఆశించిన బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సూచించారు. భీమారం శివారులో సాగు చేస్తున్న వరి పంట క్షేత్రాలను గురువారం సందర్శించిన ఆయన వరి పైరులు తుగుళ్ల ఉన్నట్లు గుర్తించారు. ఎండు తెగులు నివారణకు కాసుగామైసిన్ 5 శాతం తో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 45 శాతం, 500 గ్రాములు లేదా ప్లాంటోమైసిన్ 100 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా చాలా వరకు వరి పొట్ట దశలో ఉన్నందున రైతులు ఈ దశలో 20కిలోల యూరియా 12.5 కిలోల పొటాష్ వేసినట్లయితే మంచి దిగుబడులు ఆశించవచ్చు అని తెలిపారు.

మద్యం మత్తులో తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

- తల్లి మృతి, చికిత్స పొందుతున్న కూతురు

నవతెలంగాణ-మంచిర్యాల



మద్యం మత్తులో తల్లి కూతుర్లు గొడవ పడి ఆత్మ హత్యకు పాల్పడ్డారు. తల్లి మృతి చెందగా కూతురు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తే ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చున్నంబట్టి వాడలో నివాసముంటున్న పస్తం పోశమ్మ(80) తన కూతురు రాజమ్మ(35) ఇద్దరు కలిసి ప్లాస్టిక్ బాటిళ్ల ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇద్దరు కలిసి మద్యం సేవించి ఇంటికి వచ్చిన తరువాత ఇద్దరూ గొడవ పెట్టుకున్నారు. అనంతరం గుర్తు తెలియని పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన మనువడు పస్తం బిమేశ్ ఆటోలో ఇద్దరిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తల్లి పోశమ్మ బుధవారం రాత్రి మృతి చెందింది. కూతురు ఐసీయూలో విభాగంలో చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆమె పరిస్థితి సైతం విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలి కొడుకు గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- ప్రఖ్యాత సైకాలజిస్ట్ బొల్లంపల్లి సత్య ప్రకాష్



నవ తెలంగాణ-లక్షెట్టిపేట

ప్రతి విద్యార్థిలో అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని సరి అయిన రీతిలో బహిర్గత పరచడానికి సైకాలజిస్టుల సహకారం అవసరమవుతుందని, విద్యార్థులందరూ తమ అంతర్గత నైపుణ్యాలను మెరుగుపరచుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రముఖ సైకాలజిస్టు, గ్రాఫాలజిస్టు, మోటివేషనల్ స్పీకర్, సాఫ్ట్ స్కిల్స్ అనలిస్ట్ బొల్లంపల్లి సత్య ప్రకాష్ అన్నారు. గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో, విద్యార్థులకు ఏర్పాటు చేసిన మనో విశ్లేషణాత్మక ప్రేరణ శిక్షణ కార్యక్రమంలో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైకాలజీ మోటివేషన్ క్లాసులో పలు అంశాల గురించి వివరించారు. మోటివేషన్ సెషన్ లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే మహేశ్వర రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ కె లత, ఉపాధ్యాయినులు ఉమాదేవి, సరస్వతి, పుష్పాల రజిత పాల్గొన్నారు.

టీఎస్ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని అశోక్ నగర్ సురభిఫంక్షన్ హాల్‌లో గురువారం టీఎస్ కిడ్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి మల్లేశం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలీ, కరస్పాండెంట్ హర్ష భాను, టీచర్లు నిక్కుర్ తస్వీర్, చైతన్య, శ్వేత, అఫ్రి పాల్గొన్నారు.

ఇందారం-1ఏ భూగర్భ గనిలో ప్రమాదం

- తీవ్రంగా గాయపడిన గని కార్మికుడు

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం-1ఏ భూగర్భ గనిలో ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన సపోర్టు మెన్ కార్మికుడు అంగల రాజయ్య తీవ్రంగా గాయపడ్డాడు. భూగర్భ గని 8వ ప్యానల్ 13వ డీప్ ఆఫ్ సెవెన్ లెవెల్‌లో సపోర్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. సపోర్టు వర్క్ చేస్తుండగా ఊహించని విధంగా సైడ్ ఫాల్ కావడంతో కార్మికుడి కాలు విరిగినట్లు తోటి కార్మికులు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు తెలుసుకున్న అధికారులు వెంటనే సదరు కార్మికున్ని వైద్య సేవ నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ కార్మికున్ని పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నివేదికలు సృష్టించడం సరికాదు : హెచ్ఎంఎస్

ఇందారం-1ఏ గనిలో జరిగిన ప్రమాదం తీరుపై గని అధికారులు తప్పుడు నివేదికలు సృష్టించడం సరికాదని హెచ్ఎంఎస్ నాయకులు ఆరోపించారు. సపోర్టింగ్ చేస్తుండగా ఊహించని విధంగా సైడ్ ఫాల్ కావడంతో కార్మికుడు అంగల రాజయ్య తీవ్రంగా గాయపడ్డట్లు హెచ్ఎంఎస్ నాయకులు తెలిపారు. దీనికి విరుద్ధంగా గని అధికారులు గాయపడ్డ కార్మికుడు స్లిప్పు అండ్ ఫెల్ డౌన్ అని తప్పుడు రిపోర్టు రాసిపై అధికారులకు ఏమీ జరగలేదన్నట్లుగా ప్రమాదాన్ని కప్పిపుచ్చుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. కార్మికుడు ఏదైనా తప్పు చేసినట్లయితే వెంటనే చార్ సీట్లు సస్పెండ్లు లెటర్లు ఇచ్చి అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్న అధికారులు తప్పుడు రిపోర్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పై అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న అధికారులపై డీజీఎంఎస్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పద్ధతులు వెంటనే మానుకోకపోతే హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు సారయ్య, సెంట్రల్ కమిటీ నాయకులు, అనిల్‌రెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ పొన్నగంటి అశోక్, నోముల బాలయ్య, దుర్గం లక్ష్మణ్ ఉన్నారు.

కార్మికునికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రమాదంలో గాయపడిన అంగళ రాజయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. గురువారం ఉదయం షిఫ్టులు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని సందర్శించి గాయపడ్డ కార్మికున్ని పరామర్శించారు. సపోర్ట్ మాన్ డ్యూటీ నిర్వహిస్తున్న అంగల రాజయ్యకు తొంటికి గాయమైనదని, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించాలని డాక్టర్లను కోరారు. ఆస్పత్రిని సందర్శించిన వారిలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి కొమరన్న ఉన్నారు.

పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

- రెండు తులాల బంగారు గొలుసు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 10న చెన్నూర్ పట్టణంలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు దొంగలించిన అంతరాష్ట్ర దొంగ అల్లెపు కృష్ణను పోలీసులు పట్టుకున్నట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. గురువారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి వివరాలు వెల్లడించారు. సిద్దిపేట్ పట్టణానికి చెందిన అల్లెపు కృష్ణ ఈ నెల 10న చెన్నూర్ పట్టణానికి చెందిన జంగ మనెమ్మ పాత బస్టాండ్ ఏరియా ఒంటిరిగా వచ్చినట్లు నిందితుడు గుర్తించాడు. బాధితురాలైన మనెమ్మతో మటాలు పక్కనున్న గ్రోమోర్ షాపు పక్కన గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకుపోయి మెడలోని బంగారు గొలుసు ఇవ్వాలని లేదంటే గొంతు నులుమి చంపుతానని బలవంతంగా ఆమె మెడలోని-2 తులాల గొలుసును లాక్కొని పారిపోయాడు. మనెమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఏర్పాటు చేసిన స్పెషల్ టీమ్ గాలిస్తుండగా గురువారం ఉదయం 8 గంటలకు కొత్తబస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో పోలీసులను చూసిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించినప్పటికీ సిబ్బంది పట్టుకుని విచారించారు. మద్యంతో పాటు జల్సాలకు అలవాటుపడిన నిందితరుడు కూలీ పనితో వచ్చే డబ్బులు సరిపోవడం లేదని దొంగతనాలు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ మేరకు నిందితుని బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని గతంలో నిందితునిపై చాల కేసులు నమోదు కావడమే కాకుండా పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు. కేసును చేధించడంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్, చెన్నూర్ ఎస్ఐ రవీందర్, సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ సంపత్, దేవేందర్, సీసీఎస్ మంచిర్యాల కానిస్టేబుల్ జీవన్ తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కృషి చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

నకిలీ విత్తనాలు అమ్మినా సాగు చేసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు అందరూ కలిసి కృషి చేయాలని తహసీల్దార్ భోజన్న, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఓ చల్ల ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నకిలీ పత్తి విత్తనాలు, గ్లైసిల్ బీటీ పత్తి విత్తనాలపై అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడానికి కలెక్టర్ మండల స్థాయి టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని, సభ్యులుగా వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎస్ఐ ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భోజన్న, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఓ చల్ల ప్రభాకర్లు వేర్వేరుగా మాట్లాడారు. విత్తనాలను వ్యవసాయ శాఖచే అధీకృత (లైసెన్స్) పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, రశీదును, విత్తన ప్యాకెట్ను పంట కాలం పూర్తి అయ్యేంతవరకు భద్రపరుచుకోవాని సూచించారు. తీసుకున్న రశీదుపైన విత్తన రకం, లాట్ నెంబర్ రేటు వివరాలు ఉండే విధంగా చూసుకోవాలని, విత్తన ప్యాకెట్ మీద లాట్ నెంబర్, విత్తన తయారీ తేదీ, గడువు తేదీ చూసుకోవాలని సూచించారు. రైతులు లూజుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసేట్ అనే కలుపు నాసిని మందును తట్టుకునే పత్తి విత్తనాలకు మనదేశంలో అనుమతి లేనందున అట్టి విత్తనాలను రైతులు ఎవరు సాగు చేయవద్దని సూచించారు. గ్లైసిల్ మందును తట్టుకునే బీటీ పత్తి రకంను సాగు చేయడం వలన భూమి ఆరోగ్యానికి, పర్యావరణానికి, మనుషులకు క్యాన్సర్, పశువుల ఆరోగ్యానికి హానికరమన్నారు. గ్లైసిల్ పత్తి విత్తనాలు అమ్మినా లేదా సాగు చేసిన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఇటువంటి విత్తనాలు సాగు చేయకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భోజన్న

సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపాట రద్దు చేయాలి

- సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంబంధించిన గనుల వేలం పాట రద్దు చేయకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మె చేపడతామని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కాంట్రాక్టర్లకు కోవర్టులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. సింగరేణి గనులను సింగరేణికి కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 2012 నుండి వేలంపాటను రద్దు చేయాలని పోరాటాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని, సింగరేణి వేలంపాటలో పాల్గొనడానికి కార్మికుల అభిప్రాయ సేకరణ నిర్వహించాలని తెలిపారు. గతంలో ఉప ముఖ్యమంత్రి వేలంపాటలను రద్దు చేయాలని తెలిపిన, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు సింగరేణి వేలంపాటలో పాల్గొనాలని తెలపడం హాస్యాస్పదమన్నారు. వేలంపాటను రద్దు చేయాలని ఉపముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. గతంలో సింగరేణిని టీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, కేంద్ర నాయకుడు తిప్పారావు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర నాయకులు బ్రహ్మానందం, సంతోష్, ఏఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి అంజన్న, కార్యదర్శి మేకల పోషమల్లు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్ : జిల్లాలోని వెనుకబడిన తరగతుల యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ హైదరాబాద్ ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట, హైదరాబాద్ నుంచి హెచ్ఎంవీ, ఎల్ఎంవీ డ్రైవింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. 38 రోజుల శిక్షణ పూర్తి అయిన తరువాత సంబంధిత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మనెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుందని, హకీంపేటలోని టీఎ, జెడ్ఎస్టీసీ (టీజీఆర్‌టీసీ) ద్వారా అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఎల్ఎంవీకి 18-45 సంవత్సరాలు హెచ్ఎంవీకి 20-45 సంవత్సరాల వయస్సు ఉండి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, ఆధార్ కార్డు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1 లక్షా 50 వేల, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఆదాయం ఉండాలి), పాస్ పోర్ట్ ఫొటోలతో జిల్లాలోని నస్పూర్‌లోగల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎఫ్-5లో గల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పనివేళలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ

నవతెలంగాణ-నస్పూర్

జాతీయ ఆరోగ్య సంస్థలో నూతనంగా మంజూరైన ఎంఎంయూ యూనిట్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి నేరుగా ముఖాముఖి పద్ధతిన దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య అధికారి(1) పోస్టుకు ఎంబీబీఎస్ పూర్తి చేసి టీఎస్ మెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, నర్సింగ్(1) అధికారి పోస్టుకు బీఎస్సీ జీఎన్ఎం నర్సింగ్ కోర్స్ ధ్రువ పత్రం, టీఎస్ మెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, ల్యాబ్ టెక్నీషియన్(1) పోస్టుకు బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ల్యాబ్లో 2 సంవత్సరాల అనుభవం, టీఎస్ పారామెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, పారామెడిక్ కమ్ అసిస్టెంట్(1) పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పనివేళలలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు నిజ ధ్రువీకరణ పత్రాలు, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ప్రతులు స్వయంగా తీసుకురావాలని, కలెక్టరేట్ ఎఫ్-1 బ్లాక్ మొదటి అంతస్తులో గల ఎఫ్-25లో గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఇతర వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ మంచిర్యాల.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నోటీసుబోర్డులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మరమ్మతులు

- ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్

నవతెలంగాణ-జైపూర్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్లలో ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్ తెలిపారు. కుందారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల షెట్‌పల్లి ఫీడర్‌లోడు విభజించేందుకు వీసీబీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో షెట్‌పల్లి ఫీడర్‌లో ఒకే వీసీబీ ఉన్నందున విద్యుత్ లోడ్ ఎక్కువగా పడుతుండేదని తెలిపారు. అదే విధంగా వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని ముందస్తుగా విద్యుత్ సబ్‌స్టేషన్లలో అవసరమైన మరమ్మత్తులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిమిత్తం ఆధునిక యంత్రాలను వినియోగిస్తూ వ్యవసాయ బోరు బావులతో పాటు గృహ వినియోగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్న సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ కైసర్, ఏడీ బాలకృష్ణ, ఏఏఈ మనోహర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదు

నవతెలంగాణ-జన్నారం



జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని నాగునూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను పట్టుకొని శిక్షించాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సీటిమల్ల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్‌ను అవమానించడం దారుణం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇలాంటి సంఘటన పురావృతమైతే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఆ దుండగులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, తాళ్లపల్లి రాజేశ్వర్, మామిడిపల్లి ఇందయ్య, మేకల మాణిక్యం ధూమల్ల రమేష్ దేవయ్య ప్రశాంత్, జంగం రవిరెడ్డి, అబ్దుల్లా, కంప సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ మండల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ దళితుడు అయినందునే ఉన్నతవర్గాల ఎమ్మెల్యేలు అతని పోడియంపై విరుచుకుపడి అగౌరవపర్చడం సరికాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సభా మర్యాదలు పాటించకుండా స్పీకర్ను ఎమ్మెల్యేలపై అనుచితంగా వాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, నాయకులు రాజశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, దాముఖ కరుణాకర్, మామిడిపెల్లి ఇందయ్యా దూమల్ల రమేష్, గంగన్న అజారుద్దీన్, డైరెక్టర్ తిరుపతి, ప్రశాంత్, కానేశ్వర్ నందు నాయక్, లక్ష్మీ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

నవతెలంగాణ-జన్నారం



నర్సరీలో పెంచుతున్న మొక్కలను నిర్వాహకులు కంటికి రెప్పలా కాపాడి ఎండిపోకుండా చూడాలని మంచిర్యాల డీఎల్పీఓ ధర్మారాణి సూచించారు. గురువారం మండలంలోని బాదంపల్లిలో ఆమె పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ జలంధర్ పాల్గొన్నారు.

కేసుల నమోదులో జాప్యం వద్దు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



కేసుల నమోదులో జాప్యం చేయకుండా సక్రమంగా నమోదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటి పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్పీని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అప్పారావ్, సిబ్బంది ఉన్నారు.

మానవ శరీరంలో కిడ్నీలు ముఖ్యం

నవతెలంగాణ-ఉట్నూర్



మానవ శరీరంలో కిడ్నీలు చాలా ముఖ్యమని, జాగ్రత్తలు పాటించి కాపాడుకోవాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేదందర్ సూచించారు. గురువారం కిడ్నీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డయాలసిస్ వార్డులో కేక్ కట్ చేసి ఒకరి నొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్ మాట్లాడుతూ నీరు ఎక్కువగా తాగుతే కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డయాలసిస్ వార్డులో రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. మహేందర్, డా.కపిల్, డయాలసిస్ ఇన్‌చార్జి అథర్, టెక్నిషియన్ తెలంగ్ మహేష్ కుమార్, రంజీత్, శివ, సాయి, స్టాఫ్‌నర్స్ సరిత పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ వద్ద 226 దేశీదారు బాటిళ్లను ఎక్సైజ్ పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ముందస్తు సమాచారంతో జిల్లా గుండా చంద్రపూర్ నుండి మహారాష్ట్రలోని సిరోంచకు వెళుతున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు తనిఖీ చేయగా దేశిదారు 226 బాటిల్స్ స్వాధీనం చేసుకొని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.7910 ఉంటుందన్నారు. హోలీ సందర్భంగా దేశిదారు అక్రమ రవాణ అవుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశిదారు పట్టుకున్న సీఐతో పాటు సిబ్బందిని డీపీఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ ధనరాజ్, రజిత, మమతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదాలలో ఒకరికి తీవ్రగాయాలైనట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ మండలం తాంసి గ్రామానికి చెందిన బరుకుంట బాబు గురువారం ద్విచక్ర వాహనంపై గోపాల్‌పేట్ గ్రామానికి తన అత్తగారింటికి వెళ్లి తిరిగి వెళ్తున్నాడు. గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఖానాపూర్ ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ రక్షణ, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలపైన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 17,18న కలెక్టర్ ఆఫీస్ ముందు 48 గంటల ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. వంటావార్పు, రాత్రి బస కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఖానాపూర్ ప్రాజెక్ట్ కార్యదర్శి ప్రసాద, ఉపాధ్యక్షురాలు రాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి



నవతెలంగాణ-జైపూర్

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గురువారం సీఐటీయూ చెన్నూర్ మండల కార్యదర్శి శారద ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17,18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేయనున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 48గంటల వ్యవధిలో స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణతో ముందుకు సాగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రవీణ, పద్మలత, అమృత, స్వరూపరాణి పాల్గొన్నారు.

ఘనంగా కామ దహనం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి కామ దహనం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కామ దహన వద్దకు గ్రామస్తులు, గ్రామ పటేల్ డప్పు చప్పుళ్లతో వెళ్లి పూజలు చేశారు. అనంతరం కామ దహనం చేశారు. మండలంలోని కోసుపటేల్‌గూడలో ఆదివాసులు తమ సంస్కృతి సాంప్రదాయాలతో కామ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీ ప్రాంతం నుంచి మాతరి, మాత్రల్ పేర్లతో రెండు వెదురు బొంగులను గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామ పెద్దల సమక్షంలో ప్రతి ఇంటి నుంచి కుడుకలు, చక్కెర బిళ్లలను సేకరించారు. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పొలిమేరలో కామ దహనం చేశారు. శుక్రవారం ఉదయం హోలీ పండుగ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమ్రం రావుజీ, దేవారి కుమ్రం, జంగు బాపు, మహాజన్ కోరేంగ వాగు, కారోబరి కోసేరావ్, యాదవ్‌రావ్, జనార్ధన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల



విద్యార్థితో పాఠ్యాంశాన్ని చదివిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్య నందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంట శాల, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులు పఠనా సామర్థ్యాలను పరీక్షించి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఎల్‌బీఆర్ జన్మదిన వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

మాజీ డీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి 71వ జన్మదిన వేడుకలను మండలంలోని రుయ్యాడి గ్రామ హుస్సేన్ హుస్సేన్ ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. వేడుకల్లో భాగంగా ఆయన జీవన ప్రస్థాన పుస్తకాన్ని సైతం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాసరెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. అనంతరం మాట్లాడుతూ లోక భూమారెడ్డి ప్రజాభిమానం చురగున్న వ్యక్తిని కొనియాడారు. చిన్నతనం నుంచే రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. సొంత గ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నికయ్యారని, రాష్ట్ర విజయ డైరీ చైర్మన్‌గా పనిచేసి విజయ డైరీని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఇందులో మడుపు భూమారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రంగనేని మనిషా, మాజీ ఎమ్మెల్యేలు రేఖశ్యాం నాయక్, రాథోడ్ బాపురావు, పారిశ్రామిక వేత్తలు ప్రేమేందర్ రెడ్డి, వసంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, పీడీ రవీందర్, మాజీ డీసీసీబీ చైర్మన్ దామోదర్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు గంగన్న, కాంతారావు, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, మోతే శ్రీనివాస్, కేదేశ్వర్ రెడ్డి, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఢిల్లీలో ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుండి బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేబర్ కోడ్‌లు అమలైతే బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ అధిపతుల వ్యక్తిగత ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. 18న ఢిల్లీలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు ఖలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, దొడ్డిపాట్ల రవీందర్, సిరికొండ రాయమల్లు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం బదులు కాలువలు నిర్మించండి



నవతెలంగాణ-జైపూర్

గంగిపల్లి గ్రామ శివారులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించతలపెట్టిన చెక్‌డ్యాం బదులుగా కాలువలు నిర్మించాలని శివారు రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ శివారు చెరువు మత్తడికి అతి సమీపంలో చెక్‌డ్యాం నిర్మిస్తే ఎవరికి ఉపయోగం లేకుండా పోతుందని పేర్కొన్నారు. చెక్‌డ్యాం బదులుగా కాలువలు నిర్మాణం చేపడితే సాగుకు నీరు సమకూరుతుందని పేర్కొన్నారు. కాలువల నిర్మాణంతో మరో 50 ఎకరాల భూమి సాగులోకి వస్తుందని రైతులు పల్లెం దుర్గమ్మ, జనంపల్లి స్వామి, నరెడ్ల తిరుపతి, నరెడ్ల లక్ష్మినారాయణ, ఎనగందుల భీమమ్మ, బోడికె దుర్గయ్య, జనగామ చిన్నయ్య, మామిడి సత్తయ్య తెలిపారు.

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

గోన స్వామి ఇంటిని కూల్చివేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రంగాపేట్ కొత్తగూడెంలో గోనె స్వామి కుటుంబం గుడిసెను తొలగించిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని గురువారం ర్యాలీ, ధర్నా అనంతరం ఆటవీ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 40 కుటుంబాలు తరతరాలుగా భూ పోరాటం ద్వారా సాధించుకున్న స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. గోనె స్వామి- మల్లేశ్వరి సైతం గ్రామ పంచాయతీకి 2005 నుండి 2009 వరకు ఇంటి ట్యాక్స్ చెల్లించారన్నారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2008లో ఇందిరమ్మ ఇల్లు కూడా నిర్మించుకున్నారని తెలిపారు. రెండు నోటీసులు ఇచ్చి ఇటీవల ఇంటిని కూల్చేశారని తెలిపారు. స్థానిక ఫారెస్ట్ అధికారులు కొంతమంది నాయకుల మాయ మాటలు విని నిరుపేద కుటుంబాన్ని లక్ష్యం చేసుకుని దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించకుంటే గోనే స్వామి కుటుంబంతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరవధిక ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గూట్ల ప్రసాద్, గోనె స్వామి, గోగు శేఖర్, రేగుల గంగన్న, మచ్చ కైలాస్, మాన్య శ్రీనివాస్, చంద్రకళ, సావిత్రి పాల్గొన్నారు.

ఘనంగా కామదహన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా కామదహనాలు ఘనంగా నిర్వహించారు. కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణేష్ మందిర్ వద్ద గురువారం రాత్రి కామదహన మహెూత్సవము ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హోలీకి ముందు రోజు కామదహనం చేయడం పరిపాటి. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో కామదహన వేడుకలు నిర్వహించారు. పట్టణ ప్రజలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెంచికల్‌పేట్‌లో మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలో కాముని పౌర్ణమి సందర్భంగా మహిళలు కామెడీ దహనాన్ని నిర్వహించారు. ఆదివాసుల ప్రధాన పండుగల్లో ఒక్కటైన హోలీ వేడుకలను జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. కాముడిని దహనం చేసి వేడుకలను నిర్వహించారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్/జైనూర్/పెంచికల్‌పేట్





వినియోగదారులు బిల్లు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మార్కెట్ ఏ వస్తువులు కొన్న దానికి సంబంధించి బిల్లును తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని మావలలోని జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి వినియోగదారుడు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు జీఎస్టీతో కూడుకున్న బిల్లులు కచ్చితంగా తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లుల సంతోష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీపీయూ కౌన్సిలర్ పి. పద్మ అన్నారు. గురువారం పట్టణంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో షుర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, ఫీల్డ్ సుపర్‌వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సంరక్షణకు ఒక వ్యవస్థానే పని చేస్తుందన్నారు. వారికి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, ఎన్జీఓలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181,1098కి కాల్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహన నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ హెచ్‌ఎం రాజశేఖర్, కేజీబీవీ స్పెషలాఫీసర్ జాదవ్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

వార సంతలో అన్నదానం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామ సంతలో లేకూరి సుధాకర్, జిల్లాల శ్రీను మిత్ర బృందం సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి సరుకులు అమ్ముతున్న వారికి తమ వంతుగా అన్నదానం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వసీం, ఉపాధ్యక్షుడు పాత శ్రీనివాస్, నామల సుధాకర్, నామాల ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు, భవనాల శాఖ మంత్రిని కలిసిన తుల అరుణ్‌కుమార్



నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలో రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయాలని, నూతనంగా రోడ్లు నిర్మించాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, నూతనంగా ఏర్పడిన సొనాల మండల కేంద్రంలో బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. నిర్మల్ జిల్లా మహబూబ్ ఘాట్ నుండి ఓల్డ్ హైవే-7 రోడ్డు వాంకిడి గ్రామం మీదుగా నూతన హైవే వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఇచ్చోడ మండల కేంద్రం నుండి మాన్కాపూర్, నర్సాపూర్, చించోలి మీదుగా సిరిచెల్మ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి ఉట్నూర్ వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన మంత్రి త్వరలోనే ప్రతిపాదన పంపించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

వేతనాలు పెంచాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డెయిలీ వెజెస్ కంటీజెంట్స్ ఎస్ఎంఆర్, పార్ట్‌టైమ్ సానిటేషన్ వర్కర్ల వేతనాలు పెంచాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో తమకు గెజిట్ లేఖ ప్రకారం ఈ సంవత్సరం వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన తాము చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కనుగుణంగా వెంటనే వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణ, జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, జైపాల్, నర్సిములు, భీంబాయి, లక్ష్మీ లింగమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | మార్చి 14, 2025 | www.navatelangana.com

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నాయకులు గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఏబీవీపీ నాయకుడు అక్షయ్ మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందులో నవదీప్, గణేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

గోగుపువ్వుతో రంగు తయారు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



చిత్రంలో కనిపిస్తున్న ఈ చెట్టు మోదుగ చెట్టు. ఎంతో ఆకర్శణీయంగా ఉంటూ చూపరులను కనివిందు చేస్తుంది. ఈ చెట్టు పూలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ చెట్టు పూలతో పూర్వం రంగులు తయారు హోళీ ఆడటం జరుపుకునేవారు. ప్రస్తుతం రెడీమెడ్ రంగులు వాడకం పెరిగినా, ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఈ పువ్వులతో తయారు చేసిన రంగుతోనే హోళీ ఆడుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-ఇచ్చోడ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐటీసీ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా సహకారంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పోషణమేళా నిర్వహించారు. ఈ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆహారంలో అయోడిన్ సరియైన మోతాదులో లేకపోవడం వల్ల అయోడిన్ లోపం ఏర్పడుతుందని, దీంతో గాయిటర్ థైరాయిడ్ వంటి రుగ్మతలు వస్తాయన్నారు. అందుకు చిన్న పిల్లలు, పాలిచ్చే తల్లులు, అయోడిన్ ఉన్న సి విటమిన్ ఫుడ్ చేపలు, రొయ్యలు, కూరగాయలు, పాలు నాణ్యమైన పౌష్టికాహారం ప్రతినిత్యం తీసుకోవాలన్నారు. ఇందులో కేజీబీవీ ప్రిన్సిపల్ మల్లికా, ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, శశిమాల, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఘనంగా కామ దహనం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాన్కాపూర్ తదితర ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గురువారం సంస్కృతి సాంప్రదాయం ప్రకారం హోళీ కామ దహనం నిర్వహించారు. గ్రామ పొలిమేరలో మంటలు కాల్చి కూడకలు, చక్కెర బిళ్లలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో నార్నూర్ గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, దేవరీ మెస్రం చందర్ షావ్, మెస్రం సీతారాం, మెస్రం మోతిరాం, కొట్నాక్ నానాజీ, పవన్ కుమార్, కుంరం సేడ్మారావ్, మెస్రం భీంరావ్, సోంజీ, నాగోరావ్, ఎత్మారావ్, రమేష్ ఉన్నారు.

సహజ రంగులతో హోళీ ఆడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్కెట్‌లో లభించే రసాయన రంగులతో కాకుండా సహజసిద్ధ రంగులతో హోళీ ఆడాలని సంత్ శ్రీ ఆశారాం బాపుజీ ఆశ్రమ సభ్యులు కోరారు. హోళీ పండుగ నేపథ్యంలో మొదుగ పూలతో సహజసిద్ధంగా ఆశ్రమంలో రంగులను తయారు చేశారు. వారం ముందు పూవ్వులను సేకరించి తీసుకువచ్చి వాటిని ఎండబెట్టి రంగును తయారు చేసినట్లు ఆశ్రమ సభ్యులు పొచ్చయ్య పేర్కొన్నారు. ఇరవఏండ్లుగా ఇలానే సహజ రంగులతో హోళీ ఆడుతున్నామన్నారు. దీంతో సైడ్ ఎఫెక్స్ ఉండవని, ప్రకతి ద్వారా లభించే వాటితో రంగులు తయారు చేసుకుని వాడాలని కోరారు.

అంతర్జాతీయ కిడ్ని దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అంతర్జాతీయ కిడ్ని దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరిండెంట్ గోపాల్‌సింగ్, డాక్టర్ సునీల్ కుమార్ రాథోడ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 2018లో ఆస్పత్రిలో 10 పడకల యూనిట్‌తో డయాలసిస్ కేంద్రం ప్రారంభించడం జరిగిందని, ఇప్పటి వరకు 62,571 మందికి డయాలసిస్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అద్భుతమైన సేవని అందించడం జరుగుతుందన్నారు. ఇందులో డాక్టర్ వాసు, దయాకర్, ఆఫీస్ సూపర్ సూపరిండెంట్ నవీన్, ఆర్ఎంఓ సమత, నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, విజయలక్ష్మి, కమలమ్మ, సాయి తేజ, రాకేశ్, రంజిత్, డయాలసిస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పట్టణంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హోళీ పండుగ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు తీసుకొని రోడ్ల పైకి వస్తే చర్యలుంటాయన్నారు. మధ్య తాగి ట్రిపుల్ రైడ్, ర్యాష్ రైడింగ్ చేసిన వారిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తామని మద్యం తాగి ఉన్నవారి పట్ల కటినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల ముందస్తు హోలీ సంబురాలు

నవతెలంగాణ-జన్నారం

పొనకల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పండగల విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే.రాజేశం ఉపాధ్యాయులు కే శ్రీకాంత్, బివనిత, కే సుజాత, అజాద్ పాల్గొన్నారు. అదేవిదంగా కలమడుగు వివేకానంద పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం సతీష్ గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.



జన్నారంలో..

మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ సదర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఆనందంగా నిర్వహించే పండుగ అని, ప్రజలందరూ ఐక్యంగా హోలీ పండగ జరుపుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సిబ్బంది సైతం ఆనందోస్తహల నడుమ హోలీ సంబరాలు జరుపుకున్నారు.



మచిర్యాలలో..

తాండూర్ : తాండూర్ కస్తూర్బా గురుకులంలో గురువారం హోలీ సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు ఒకరి కొకరు రంగుల చల్లుకొని ఉత్సాహంతో పండగ సంబరాలు జరుపుకున్నారు. రసాయనాలు లేని సహజమైన రంగులతో హోలీ సంబరాలు జరుపుకోవాలని ఎస్ఓ కవిత సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ నియోజకవర్గాలలో ఏటీసీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని లేబర్ ఎంప్లాయిమెంట్ శిక్షణ శాఖ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో ఐటీఐ, ఏటీసీలు లేని గ్రామీణ నియోజకవర్గాల్లో వాటి ఏర్పాటు కోసం స్థల సేకరణకై గురువారం జూమ్ మీటింగ్ ద్వారా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో సమీక్షించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, ఇదే తరహాలో గ్రామీణ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఐటీఐ, ఏటీసీ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 45 ఏటీసీ కేంద్రాలను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని, రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్‌లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. అంతే కాకుండా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని అనువైన ప్రదేశాలను వెతికి తగు నివేదికలను సోమవారంలోగా సమర్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారంలోగా నివేదికలు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ మీటింగ్ ఆర్డీఓ వినోద్ కుమార్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను నరికితే చట్టరిత్య చర్యలు తప్పవు



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని దేవునిగూడెం గ్రామంలో గురువారం పలువురు కేసీఆర్ హరితవనాన్ని ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న డీఎఫ్ఓ హరితవనాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో అటవీ శాఖ అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. గత సంవత్సరం దేవాలయ నిర్మాణానికి రెండు గుంటలు మంజూరు చేయాలని తహశీల్దార్‌కి వినతి పత్రం అందించడం జరిగిందని, మా గ్రామానికి రోడ్డు మంజూరు అవడంతో అటవీ శాఖ అధికారులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చినప్పటికీ స్పందించలేదన్నారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడుతూ గుడి నిర్మాణానికి కావలసిన భూమి కొరకు సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు అనుమతులు, రోడ్డు నిర్మాణానికి రోడ్డు భవనాల శాఖ అధికారుల అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని, గ్రామస్తులు ఎవరు కేసీఆర్ హరితవరాన్ని ధ్వంసం చేయకూడదన్నారు. ఎవరైనా ధ్వంస చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో తహశీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎఫ్‌డీఓ భవాని శంకర్, రేంజ్ ఆఫీసర్ గీతారాణి, రమేష్ రావు, అవినాష్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొత్తూరు, తలమడుగు గ్రామాల్లో ఎస్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా చేపడుతున్న సీసీ రోడ్లు, మురికి కాలువలకు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్‌తో కలిసి గురువారం భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ.8 లక్షలతో సీసీ పనులు, కొత్తూరులో రూ. 5 లక్షలతో మురికి కాల్వల పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. మండలానికి రూ. కోటి 65 లక్షల అభివృద్ధి పనులు మంజూరైనట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా పనులకు శ్రీకారం చూడుతోందన్నారు. ఇందుకు కషిచేసిన మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌కు మండలం తరపున కతజ్ఞతలు తెలిపారు. ఇందులో మాజీ జెట్పీటీసీ బొల్లారం బాబన్న, మాజీ ఎంటీపీసీ గౌరమ్మ వెంకన్న యాదవ్, రావుల నారాయణ, కాడే నారాయణ, ఇంద్రసేనారెడ్డి



నారాయణరెడ్డి, జగదీష్ రెడ్డి, రామయ్య, హనుమన్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడు రోజులు కొనుగోలు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలో కందులు, శనగ కొనుగోలును మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆదిలాబాద్ సెంటర్ ఇన్‌చార్జి కేంద్రే పండరీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హోళీ పండుగ, ఆదివారం రావడంతో నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి ఈనెల 17 నుంచి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని సూచించారు.

15 నుండి ఒంటి పూట బడులు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 15 నుండి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ రామారావు గురువారం ప్రకటనలో తెలిపారు.

ప్రాజెక్ట్ నీరు వృథా కాకుండా చూడాలని వినతి



నవతెలంగాణ-బోథ్

నీటి ఎద్దడి నివారించేందుకు సొనాల మండలంలో చింతలబోరి ప్రాజెక్ట్ నీరు వృథా కాకుండా చూడాలని మండల కేంద్రానికి చెందిన రైతులు, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం తహసీల్దార్ మల్లేష్‌కు వినతి పత్రం అందజేశారు. సొనాల మండల కేంద్రంలో గత రెండు వారాల నుంచి నీటి ఎద్దడి ఏర్పడడంతో గ్రామ ప్రజలు నాయకులు చింతలబోరీ ప్రాజెక్టు సందర్శించి అక్కడ ఉన్నటువంటి నీటి నిల్వ పరిశీలించారు. నీరు వృథా కాకుండా సొనాల వరకు వచ్చే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కోరారు. అదే విధంగా సొనాల చింతలబోరి విద్యుత్ ఫీడర్‌కు సంబంధించి త్రీఫేస్ విద్యుత్ లైన్ పగలు, రాత్రి 5 రోజులు ఆపి ఉంచాల్సిందిగా తహశీల్దార్‌ను కోరారు. ఇందులో నాయకులు బండారి మురళీధర్, వసంత్‌రావు, సూర్యపాటిల్, నడిపి గంగారం, భీంరావు పాటిల్, శివయ్య అమృత్‌రావ్ పాటిల్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి సామర్థ్యం పరిశీలన

సొనాల మండల కేంద్రానికి చెందిన నాయకులు గురువారం బైక్ ర్యాలీతో వెళ్లి చింతలబోరి ప్రాజెక్టు నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. కుడి, ఎడమ కాలువలో నీటి వథాగా పోతుండటాన్ని గమనించారు. వేసవి దృష్ట్యా సొనాలో నీటి కొరత ఉన్నందున ప్రాజెక్టు నీరు వృథా కాకుండా నీటి నిల్వకై మండల అధికారులు కృషి చేయాలన్నారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు సదానందం, నరోత్తం రెడ్డి, నాయకులు మురళీ, పోతన్న, గంగయ్య, తుల సతీష్, భీంరావ్ పాటిల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-బోథ్

వేసవి దృష్ట్యా ప్రయాణికులు అవసరార్థం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం సామాజిక సేవకుడు మీర్ ఇర్షాద్ అలీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు పలు పనుల నిమిత్తం కేంద్రానికి వచ్చే వారు తమ దాహం తీర్చుకోవాలని కోరారు. ఇందులో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి గురువారం పార్టీ శ్రేణులతో వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఇందులో మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, యెల్మల్‌వార్ రామ్ కుమార్, షేక్ ఇమ్రాన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్, ఉపాధ్యక్షుడు కొండూరి రవి, నాయకులు ఉన్నారు.

ఐకేపీ సిబ్బందికి అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సరస్వతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం మానవ అభివృద్ధి, మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై డీపీఎం నరేందర్, ఏపీఎం రమేశ్ ఐకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అంతే కాకుండా బ్యాంక్ లింకేజీ, స్కూల్ యూనిఫాం, స్త్రీనిధి రుణాలు సద్వినియోగంపై తదతర అంశాలను వివరించారు. ఇందులో సీసీలు, కిషన్‌రావు, సంతోశ్, శ్రీరామ్, రేవయ్య, సత్యశీల, వీఓలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో హోళీ సంబరాలు

నవతెలంగాణ-సారంగాపూర్



మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో గురువారం హోళీ పండుగ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకుంటూ ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సముద్రాల గీత, ప్రిన్సిపల్ విమల విద్యార్థులకు హోళీ విశిష్టతను వివరించారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యారులు పాల్గొన్నారు.